www.prajapakasham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 17 | అక్టోబర్ | 2026 పేజీలు : 8

# యాసంగిలో వరి సాగు చేయొద్దు



-17 మండలాల్లో కరువు ప్రభావం
-త్రాగునీరు, పశువుల అవసరాలకే ప్రాధాన్యం
-పట్టభద్రుల నమోదుకు నవంబర్ ఆరు తుది గడువు
-మీడియా సమావేశంలో కలెక్టర్

3లో

# ప్రభుత్వ బడులకు మహర్దశ



-పాఠశాలల అభివృద్ధికి రూ. 10.12 కోట్లు ఇవ్వండి
-ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీ ని నియమించాలి
-విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ విద్యా రంగ బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్యలు చేపట్టారు. శుక్రవారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణాతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమై కీలక అంశాలపై చర్చించారు. ఖమ్మం నియోజక వర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ. 10.12 కోట్లు నిధులు మిగతా 2లో..

# సమాజంలో సుఖశాంతులు వెల్లివిరియాలి



2లో









# ప్రభుత్వ బడులకు మహర్దశ

**(మొదటిపేజీ తరువాయి)** మంజూరు చేయాలని, కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఖమ్మం నియోజక వర్గ పరిధిలోని ఖమ్మం అర్బన్ పరిధిలో ఎనిమిది పాఠశాలలు ఎన్నెస్పి కాలనీ, పాండురంగాపురం, రాజేంద్రనగర్, జి ఖమ్మం ఉన్నత పాఠశాల, బాలాజీనగర్, కూచవల్లీ, బాలపేట (వైఎస్ఆర్ కాలనీ), రజక వీధీ, రఘునాథపాలెం మండలంలోని వి. వెంకటాయపాలెం, జెడ్పిహెచ్ఎస్, ఎంపిపిఎస్, ఈర్లపుడి, పువ్వాడ నగర్, పాపటపల్లి, మంచుకొండ, కోయచలక పాఠశాలలో నూతన భవనాలు, మరమ్మతులు, డిజిటల్ బోధన పరికరాల కోసం రూ.10.12 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా 2,988 మంది ఎస్సి, ఎస్టి, బిసి, బలహీన వర్గాల విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలల్లో వసతులు మెరుగుపడడంతో పాటు కార్పొరేట్ స్థాయిలో అభ్యాసన సామర్థ్యం పెరుగుతుందని మంత్రి తెలిపారు. కొత్తగూడెంలోని డా॥ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయానికి త్వరితగతిన రెగ్యులర్ ఉపకులపతి(వీసీ)ని నియమించాలని కోరారు. పూర్తి స్థాయిలో నాయకత్వం ఉంటేనే పరిశోధనలు, పరిపాలన వేగవంతం అవుతాయన్నారు. వర్సిటీలో కనీస మౌలిక వసతులు కల్పించడంతో పాటు నాన్ టీచింగ్, ఎంప్లాయిస్ అసోసియేషన్ ఇచ్చిన వినతి పత్రంపై దృష్టిసారించి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# సమాజంలో సుఖశాంతులు వెల్లివిరియాలి

**- భక్తిభావంతో పాటు సేవా దృక్పదం అలవర్చుకోవాలి**
**- అన్నదానం అత్యంత పవిత్రమైంది**
**- ఎంఎల్ ఏ కూనంనేని**

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** సమాజంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణ పరిధిలోని గాజులరాజం బస్తీ నెహ్రూబస్తీ తదితర ప్రాంతాల్లో ఉత్సవ కమిటీలు ప్రతిష్టించిన దుర్గాదేవి అమ్మవారి మండపాలను శుక్రవారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మహాఅన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటారని చెప్పారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పండుగలు ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనతో పాటు సమాజహితమైన సేవా భావాన్ని పరస్పర సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పేదలకు ఆకలి తీర్చే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అత్యంత అభినందనీయమని ఉత్సవ కమిటీలను కొనియాడారు. బస్తీల్లో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహిస్తున్న కమిటీలు ఐఖ్యమత్యంతో ముందుకు సాగాలన్నారు. సమాజంలో అసమానతలు తొలగి సర్వజనుల సంక్షేమం వర్ధిల్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ కార్పొరేటర్లు నాయకులు గడ్డం శాంతిప్రియ, దాసరి శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్ గడ్డం రాజయ్య ప్రభాకర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతనకల్లులో అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠ

**-హాజరైన ఎంఎల్ఏ మట్టా రాగమయి, శాసన సభ ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి**





**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల పరిధిలోని నూతనకల్లు గ్రామంలో హరిహర సుత అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు సత్తుపల్లి ఎంఎల్ఏ డాక్టర్ మట్టా రాగమయి, తెలంగాణ శాసనసభ ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ముఖ్య అతిథులకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు మంగళవాయిద్యాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల శరణుఘోషతో నూతనకల్లు గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయాన్ని ప్రతిష్ఠించడం ఎంతో శుభపరిణామమన్నారు. స్వామి వారి కృపాకటాక్షలతో ప్రజలంతా ఆయురోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, ప్రశాంతతను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

**ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ ఆడపడచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, మన సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ దంపతులు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ దంపతులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ రాష్ట్ర చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రదాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో ముడిపడి ఉన్న గొప్ప సాంస్కృతిక వేడుక అని పేర్కొన్నారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత అని, మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలు జరుపుకోవడం మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతుందని అన్నారు. తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో, సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం నాయకులు, వారి కుటుంబ సభ్యులు మహిళలతో కలిసి కోలాట నృత్యాలు చేస్తూ బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరగా బతుకమ్మలను సాగనంపే కార్యక్రమంలో పాల్గొని వేడుకలను ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ, వేముల శ్రావణి, వుంద్రు వరలక్ష్మి, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని, తాతా నిర్మల, డాక్టర్ మురళీకృష్ణ, మచ్చా బుజ్జి, ఫణితి సైదులు, శ్యామ్‌బాబు, రత్నగిరి పాల్గొన్నారు.

# బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పోలీస్ కమిషనరేట్ పరిధిలో దీపావళీ బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు లైసెన్స్‌ల కోసం ధరఖాస్తు చేసుకోవాలని పోలీస్‌కమిషనర్ సునిల్‌దత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైర్‌ఆఫీసర్ నుంచి ఎన్‌ఓసి సర్టిఫికెట్, ప్రభుత్వ స్థలంలో దుకాణం ఏర్పాటు చేసేవారు మున్సిపాల్, పంచాయతీ అధికారుల అనుమతి పత్రం, ప్రైవెట్ భూమిలో అయితే భూ యజమాని నుంచి ఎన్‌ఓజీ సర్టిఫికెట్, గత ఏడాది లైస్సెన్స్ పొందిన వారైతే సంబంధిత పత్రం నకలు, వాణిజ్య పన్నుల శాఖ అనుమతి పత్రం ధరఖాస్తుతో కలిపి సమర్పించాలని సూచించారు. అదేవిధంగా లైసెన్స్ ఫీజ్ రూ.1500/ లను ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్‌బిఐ బ్యాంక్‌లో చెల్లించి సదరు రసీదు సమర్పించాలని పేర్కొన్నారు. ఫామ్ ఏఈ 5ను పూర్తిచేసి పైన పెర్కొన్న వాటిని జతచేసి ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని సిపి వివరించారు.

# గంజాయి నిల్వలపై దాడులు..ముగ్గురు అరెస్ట్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి నిల్వలపై పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదేశాల మేరకు టౌన్ ఏసిపి రమణమూర్తి ఆధ్వర్యంలో సిఐ చిట్టిబాబు, ఎస్సై కొండలరావు సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు చేశారు. వెంకటేశ్వరా నగర్‌లోని బాణోతు దేవి నివాసంలో గంజాయి నిల్వలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేసినట్లు సిఐ చిట్టిబాబు తెలిపారు. ఈదాడుల్లో ఒక కేజీ నూటపదిహేను గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని బాణోతు దేవితో పాటు బాణోతు సాయిరామ్, బాణోతు సంతోష్‌లను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మం పోటీలకు ఆహ్వానం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఔత్సహిక పోటీల్లో భాగంగా రాష్ట్రాస్థాయి ఫోటో గ్రాఫీ, షార్ట్ ఫిల్మం పోటీలకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు పోలీసుకమిషనర్ సునిల్‌దత్ శుక్రవారం తెలిపారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో వారి ప్రతిభ తెలిపే విధంగా మూడు నిమిషాల నిడివి ఉన్న షార్ట్ ఫిల్మం తీసి పంపాలని సూచించారు. ఈనెల 23వ తేదీ లోగా సంబంధిత షార్ట్‌ఫిల్మంను పెన్‌డ్రైవ్‌లో లోడ్ చేసి పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని పిఆర్‌ఓ సెక్షన్‌లో సమర్పించాలని పేర్కొన్నారు. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సహికులు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలకు సంభందించి గత ఏడాది అక్టోబర్ నుంచి ఈఏడాది అక్టోబర్ నెల వరకు తీసిన మూడు ఫోటోలు, షార్ట్‌ఫిల్మం మాత్రమే పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 8712659256 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

# విద్యుత్ ఉపకేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** విద్యుత్ వినియోగం పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన ముందస్తు చర్యలపై టిజి ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి శుక్రవారం కొత్తగూడెం జిల్లాలోని జూలూరుపాడు 400 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరు, విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా సామర్థ్యం, రాబోయే సీజన్‌లో పెరగనున్న లోడ్‌ను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, విద్యుత్ వ్యవస్థలోని కీలక పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సాంకేతిక వ్యవస్థల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీఎండీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగుడెం ఎస్ఈ జి .మహేందర్ , డి.ఈ కొత్తగూడెం తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా లాటరీ

**-కల్లూరు 2బి బార్ దక్కించుకున్న తరుణ్**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** మద్యం దుకాణాలకు సంబంధించి లాటరీ పద్ధతిని అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. కల్లూరు మున్సిపాలిటీకి కేటాయించిన 2బి బార్ కేటాయింపు ప్రక్రియను శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ 2బి బార్ కోసం 325 మంది దరఖాస్తు చేశారు. లాటరీ ప్రక్రియలో భాగంగా ప్రతి దరఖాస్తుదారుకు కేటాయించిన టోకెన్ నెంబర్‌ను నాణ్యంపై ప్రదర్శించి ఒక స్టీల్ బాక్స్‌లో వేశారు. లాటరీ ప్రక్రియలో భాగంగా ఒక నాణ్యాన్ని తీసి విజేతను ప్రకటించారు. ఈ ప్రక్రియలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లికి చెందిన చావా తరుణ్ బార్ షాపును దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జానయ్య పాల్గొన్నారు. అశ్వారావుపేటలోని 2బి బార్ కోసం కొత్తగూడెం కలెక్టరేట్‌లో నిర్వహించిన లాటరీలో పాల్వంచకు చెందిన దుబ్బాకుల నిర్మలకు బార్ షాప్ దక్కింది. మొత్తం 357 దరఖాస్తులు రాగా పారదర్శకంగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు సమక్షంలో లాటరీ తీశారు. మొత్తం రాష్ట్రంలో 46 బార్ షాపులకు శుక్రవారం లాటరీ నిర్వహించారు.

# ఖమ్మం జిల్లాలో హోటళ్ల ఇష్టారాజ్యం..!

**-ఆహార నాణ్యతకు గ్యారెంటీ ఏది...?**
**-వంటగదుల పరిశుభ్రతకు భరోసా ఏది..?**
**-రోడ్ల పక్కనే వ్యర్థాల డంపింగ్... ఒకే నూనెతో పదే పదే వంటకాల తయారీపై ఆందోళన**
**-ఆహార భద్రత అధికారుల తనిఖీలు ఎక్కడ..?**
**ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం ఎన్నాళ్లు...?**



**ప్రజాపక్షం/ తల్లాడ :** హోటల్‌కు వెళ్తే రుచికరమైన భోజనం లభిస్తుందని నమ్మి ప్రజలు డబ్బులు చెల్లిస్తున్నారు. కానీ ఆ భోజనం ఎంత నాణ్యమైనది, వంట గది ఎంత పరిశుభ్రంగా ఉంది, వంటకు వాడే నూనె, పాలు, ఇతర ముడి పదార్థాలు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా అనే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకునే అవకాశం వినియోగదారులకు ఎంత వరకు ఉంది. ఖమ్మం జిల్లాలోని హోటళ్ళ, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో ఆహార భద్రత ప్రమాణాల అమలుపై సమగ్ర పరిశీలన అవసరమనే చర్చకు ఈ అంశాలు దారి తీస్తున్నాయి. అయితే నిర్దిష్ట హోటళ్లపై ఆరోపణలు నిర్ధారించాలంటే క్షేత్రస్థాయి పరిశీలన, అధికారిక తనిఖీలు అవసరం.

### వంట గదిలోకి తొంగి చూస్తేనే అసలు బాగోతం బయటపడుతుందా..?

వినియోగదారులకు అందంగా కనిపించే హోటల్ హాల్‌లో పరిశుభ్రత ఉన్నంత మాత్రాన సరిపోదు. ఆహారం తయారయ్యే వంటగది కూడా శుభ్రంగా ఉండాలి. వంట పాత్రలు, నీటి నాణ్యత, ముడి పదార్థాల నిల్వ, వంట చేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార పదార్థాలను భద్రపరిచే విధానాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి. వంటగదుల్లో అపరిశుభ్రత ఉంటే ఆహారం కలుషితమయ్యే ప్రమాదం ఉంది. అందుకే ప్రమాణాలే కీలకం.

### వంట గదుల్లో సిసి కెమెరాలు పారదర్శకతకు మార్గమా...?

ఆహారం ఎలా తయారవుతుంది, వంట గదిలో పరిశుభ్రత పాటిస్తున్నారా, నిబంధనలకు అనుగుణంగా ఆహార పదార్థాలను నిర్వహిస్తున్నారా అనే అంశాలపై పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉంది. వంట గదుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, అవసరమైన చోట్ల పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా పారదర్శకతకు అవకాశం కల్పించవచ్చు. వినియోగదారులకు వంట ప్రక్రియను ప్రత్యక్షంగా చూపించేవిధానాన్ని కూడా పరిశీలించవచ్చు. అయితే సిసి కెమెరాలు ఉన్నాయనే కారణంతోనే ఆహారం సురక్షితమని భావించకూడదు. ప్రత్యక్ష తనిఖీలు, పరిశుభ్రత ప్రమాణాల అమలే అసలైన కొలమానం. హోటళ్ల నుంచి వెలువడే ఆహార పదార్థాలు, మిగిలిపోయిన పదార్థాలు, ఇతర చెత్తను రోడ్ల పక్కనే పడేస్తే దుర్వాసనతో పాటు ఈగలు, ఎలుకలు, ఇతర కీటకాల సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితులు ప్రజారోగ్యానికి ముప్పుగా మారవచ్చు. హోటళ్ల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారేయకుండా నిబంధనలకు అనుగుణంగా సేకరించి తరలించాలి. రోడ్ల పక్కన వ్యర్థాలు పేరుకుపోతున్న ప్రాంతాలను స్థానిక సంస్థలు గుర్తించి బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

### ఒకే నూనెతో పదే పదే వంకాలా...?

హోటళ్లలో పూరీలు, బజ్జీలు, పకోడీలు, ఇతర వేయించిన వంటకాలను తయారు చేసేందుకు ఉపయోగించే నూనె నాణ్యతపై ప్రత్యేక దృష్టి అవసరం. ఒకసారి ఉపయోగించిన నూనెను పదే పదే అధిక ఉష్ణోగ్రతల వద్ద వేడి చేయడం వల్ల దాని నాణ్యత తగ్గి హానికర సమ్మేళనాలు ఏర్పడవచ్చు. ఆహార భద్రత ప్రమాణాలకు విరుద్ధంగా నూనెను తిరిగి వినియోగిస్తే ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. అందువల్ల హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లలో వంట నూనె వినియోగంపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

### పాలు, ఇతర ముడి పదార్థాల నాణ్యతపై నిఘా ఏది...?

హోటళ్లలో పాలు, పెరుగు, నెయ్యి , పన్నీర్, ఇతర ముడి పదార్థాలను వినియోగించే విధానం కూడా కీలకమే. నాణ్యత లేని లేదా సక్రమంగా నిల్వ చేయని పదార్థాలతో వంటకాలు తయారు చేస్తే వినియోగదారుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముడి పదార్థాల కొనుగోలు, నిల్వ, గడువు, ఉష్ణోగ్రత నియంత్రణ వంటి అంశాలను అధికారులు పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనుమానాస్పద ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించి ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించే బాధ్యత అధికారులకు ఉందని ప్రజలు చెబుతున్నారు.

### ఆహార భద్రత అధికారుల తనిఖీలు కాగితాలకే పరిమితమా..?

హోటళ్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు అమలయ్యేలా చూడటం ఆహార భద్రత అధికారుల కీలక బాధ్యత. ఖమ్మం జిల్లాలో తనిఖీలు ఎంత తరచుగా జరుగుతున్నాయి, నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఆహార నమూనాల పరీక్షల్లో ఎలాంటి ఫలితాలు వచ్చాయి అనే అంశాలపై అధికారిక సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలి. పత్రకలలో వార్త కథనం వచ్చినప్పుడు జిల్లా కేంద్రంలో నామ మాత్రంగా తనిఖీలు చేసి కేవలం రికార్డులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా సాగాలని ప్రజలు కోరుతున్నారు. ఉల్లంఘనలు గుర్తిస్తే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుని అవసరమైన చోట్ల హెచ్చరికలు జారీ చేయాలి.

### ఇప్పటికైనా అధికారులు స్పందించాలి

జిల్లాలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, భోజన శాలల్లో ఆహార నాణ్యత, వంటగదుల పరిశుభ్రత, వంటనూనె వినియోగం, వ్యర్థాల నిర్వహణపై సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. నిబంధనలు పాటించే సంస్థలను ప్రోత్సహిస్తూ, ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చట్ట పరమైన తగు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు సురక్షితమైన ఆహారం అందడం హక్కు, ఆహార భద్రతను కాపాడటం అధికారుల బాధ్యత. జిల్లాలో ఈ దిశగా పర్యవేక్షణ మరింత బలోపేతం కావాలి. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావుండకూడదని పలువురు అంటున్నారు.

# ఏదులా'పుర'ంలో పాముల బెడద..!

**- ఖాళీ ప్లాట్లలో పొంచి ఉన్న విష సర్పాలు**
**- కోతులు, కుక్కలతోనూ ఇబ్బందులు**
**- బెంబేలెత్తుతున్న వార్డుల ప్రజలు**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలో ఖాళీ ప్లాట్లు పెద్ద సంఖ్యలో ఉండటంతో పాముల సంచారం పెరిగి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా నివాస ప్రాంతాల్లో కొండచిలువలు కనిపిస్తుండటం స్థానికులను కలవరపెడుతోంది. ఇటీవల 23వ వార్డులోని ఇందిరమ్మ కాలనీలో సుమారు 15 అడుగుల పొడవున్న కొండచిలువను అక్కడి స్థానికుల సహకారంతో స్నేక్ క్యాచర్ పట్టుకోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అదేవిధంగా 22,28,2930,31,32 వార్డుల్లో ఖాళీ ప్లాట్లు పెద్ద ఎత్తున్న ఉండి అడవిని తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సర్పాలు సంచరిస్తున్నట్లు స్థానికవాసులు వాపోతున్నారు. ఎండల తీవ్రతకు పాములు బయటకు వచ్చి ఇళ్ల పరిసరాల్లోకి చేరుతుండటంతో చిన్న పిల్లలు, వృద్ధుల భద్రతపై కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ వైపు నుంచి పాము వస్తుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ జివించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కోతులు, వీధి కుక్కల సంచారం కూడా విపరీతంగా పెరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో ప్రజలు నిత్యం పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఖాళీ ఫ్లాట్లలోని పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవడంతో పాటు పాములు, కోతులు, వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



### పాముల భయానికి తోడు కోతులు, కుక్కల బెడద

ఇప్పటికే పాములు సంచారంతో సతమతమవుతున్న ప్రజలకు కోతులు, వీధి కుక్కల బెడద కూడా తోడైంది. దీంతో నివాస ప్రాంతాల్లో ప్రశాంతంగా జీవించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఖాళీ స్థలాలను శుభ్రం చేయించి, పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు పాములు, కోతులు, వీధి కుక్కల సమస్యపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ప్రజలు భయాందోళనల మధ్య జీవించాల్సిన పరిస్థితి రాకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యుత్ వైరు తెగిపడి పాడి గేదె మృతి



**ప్రజాపక్షం/కారేపల్లి:** విద్యుత్ వైరు తెగిపడి పాడి గేదె మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం చీమలపాడు గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు భాగం వెంకటేశ్వర్లుకు చెందిన గేదె పంట పొలంలో మేత మేస్తుండగా మధ్యాహ్నం సుమారు 12గంటల సమయంలో 11కేవీ విద్యుత్ వైరు తెగి గేదెపై పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురైన గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనను గుర్తించిన స్థానికులు రైతుకు సమాచారం అందించారు. విద్యుత్ లైన్ల నిర్వహణ, పర్యవేక్షణలో నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం మూగజీవాల ప్రాణాల మీదకు వస్తోందని ఆవేదన చెందారు. ఈఘటనపై స్పందించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉంగరాల సుధాకర్ మాట్లాడుతూ బాధిత రైతు భాగం వెంకటేశ్వర్లుకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, గేదెను కోల్పోయిన రైతుకు తగిన పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.

## సరస్వతీ దేవి అలంకారంలో దుర్గామాత దర్శనం

**-లింగం బంజరలో అన్నప్రసాద వితరణ**



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో శుక్రవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. మండపాల వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. విశ్వనాథపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని లింగం బంజరలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం మాజీ డైరెక్టర్ సూరపరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈకార్యక్రమాల్లో నిర్వాహక కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు,పాల్గొన్నారు.

## అక్రమ గుడుండా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు

**-బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన మహిళలకు రూ 30వేల జరిమానా**



**ప్రజాపక్షం/ఇల్లందు:** గుడుంబా తయారీ, విక్రయాల కేసులో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఇల్లందు మండలం ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన ఇస్లావత్ జ్యోతి నుంచి రూ 30వేల బాండ్ మొత్తాన్ని ఎక్సైజ్ అధికారులు వసూలు చేశారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేసినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. గతంలో అక్రమ గుడుంబా కేసులో పట్టుబడిన జ్యోతి, తిరిగి నేరాలకు పాల్పడనని అధికారుల ఎదుట బైండోవర్ బాండ్ సమర్పించారు. అయితే ఇటీవల మళ్లీ అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్నట్లు గుర్తించడంతో బాండ్ షరతుల ఉల్లంఘన కింద రూ 30వేల మొత్తాన్ని రికవరీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇల్లందు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా గుడుంబా తయారు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే బాండ్ మొత్తాన్ని వసూలు చేయడంతో పాటు పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గుడుంబా తయారీ, విక్రయాలపై సమాచారం తెలిసిన వారు వెంటనే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## ధాన్యలక్ష్మీ అలంకారంలో మహాలక్ష్మీ అమ్మవారి దర్శనం

**-పర్ణశాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు**



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** భద్రాచలం సీతారామచంద్రస్వామి అనుబంధ ఆలయమైన పర్ణశాల దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఎస్ కిరణ్ కుమార్, భార్గవా చార్యులు, నరసింహాచార్యులు, సాయి వెంకటాచార్యులు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బి వాసు తదితరులు ఉత్సవ ఏర్పాట్లలో పాల్గొన్నారు.

## కొమరం భీమ్ విగ్రహా విష్కరణకు మంత్రి సీతక్కకు ఆహ్వానం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని తెలంగాణ పంచాయితీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)ను ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ప్రతినిధులు ఆహ్వానించారు. ములుగు జిల్లా తాడ్వాయి గ్రామంలో శుక్రవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. దుమ్ముగూడెం మండలం ములకపాడు సెంటర్‌లో ఈనెల 22న కొమరం భీమ్ విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి మండలంలోని ఆదివాసీ మహిళలు, సంఘాల నాయకులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. దీనిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి, విగ్రహావిష్కరణకు హాజరవుతానని హామీ ఇచ్చినట్లు వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ కుంజా శ్రీనివాసరావు, సర్పంచులు పొడియం సుబ్బారావు, కుర్సం రవి, మాజీ ఎంపీటీసీ సోడే తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

# కల్లాల్లోనే ఖతం

- పచ్చి వడ్లకు తెగ డిమాండ్
- ఆరబెట్టకముందే కొనేందుకు సిద్ధం
- సన్నాలకు పోటీ పడుతున్న ప్రైవేటు వ్యాపారులు
- ధాన్యం కొనుగోళ్లలో కొత్తట్రెండ్



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : వానా కాలం ధాన్యంపై ప్రైవేటు వ్యాపారులు కన్నేశారు. ఎల్‌నినో ప్రభావంతో వరి దిగుబడి తగ్గుముఖం పట్టగా రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు కారణంగా పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ఇప్పటి నుండే ప్రైవేటు ధాన్యం వ్యాపారులు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. దీంతో కల్లాల్లోని పచ్చి వడ్లనే ఖతం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు ఇస్తున్న బోనస్‌తో కలిపి అధిక ధరలకు కొనేందుకు ప్రైవేటు వ్యాపారులు పచ్చి కల్లాలపై పడుతున్నారు. దీంతో పచ్చి వడ్లకు తెగ డిమాండ్ పెరిగింది.

**సన్నాలకు తెగపోటీ :**
ప్రభుత్వం నిర్ణయించిన ఏడు రకాల సన్నాలకు ప్రైవేటు వ్యాపారులు అధికధరలు పెట్టేందుకు చూస్తున్నారు. దీంతో రైతులు ప్రైవేటుకు అమ్ముకునేందుకే ఆసక్తి చూపే అవకాశముంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మాలంటే అక్కడి వరకు తీసుకెళ్లాలి. అంతే కాకుండా తాలు, తేమ తరుగు రకరకాల నిబంధనలు ఉండటంతో రైతులు ప్రైవేటువైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఈ సారి తక్కువ మోతాదులో ధాన్యం వస్తుందని భావిస్తున్నారు.

**1.28 వేల మెట్రిక్ టన్నుల అంచన :**
జిల్లాలో ఈ సారి 1,28వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావచ్చని వ్యవసాయాధికార్లు అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్నాలు 124119 మెట్రిక్ టన్నులు కాగా, దొడ్డు రకం 3881 మెట్రిక్ టన్నులు. వీటిని కొనేందుకు జిల్లా వ్యాప్తంగా 119 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. సన్న రకాలు క్వింటాళ్లకు రూ.2461 కాగా బోనస్ మరో రూ.500 తో కలిపి మొత్తంగా రూ.2961 ఇవ్వనున్నారు. దొడ్డు రకం క్వింటాళ్లకు 2441 మద్దతు ధర కల్పిస్తున్నారు.

**ధాన్యం కొనుగోళ్లలో కొత్తట్రెండ్ :**
గత కొంత కాలంగా ధాన్యం కొనుగోళ్లలో కొత్తట్రెండ్ మొదలైంది. ధాన్యం కల్లాలు చేరిన తర్వాత నానా తిప్పలు పెట్టి అనేక కొర్రీలు పెట్టి వింత కోతలు విధించి కొనేవారు. కానీ ఈ సారి పచ్చి ధాన్యాన్నే కల్లాల్లో కొనే సంప్రదాయం మొదలైంది. ఈ కొత్తట్రెండ్‌తో రైతులు కొంత ఉపశమనం కలగనుంది. ధాన్యాన్ని ఆరబెట్టి తాలు లేకుండా చూసుకుని తేమ శాతం తక్కువయ్యాక బస్తాల్లోకి ఎత్తి కేంద్రాలకు తీసుకెళ్లి అమ్మకాలు సాగించే పరిస్థితి. ఇది రైతులకు కొంత శ్రమతో కూడుకున్న పని, కానీ ఇప్పుడు ప్రైవేటు వ్యాపారులు నేరుగా కల్లాల వద్దకు వచ్చి పచ్చి ధాన్యాన్నే ప్రభుత్వం మద్దతు ధర బోనస్ తో కలిపి అంతకంటే అధిక రేటు వెచ్చించి కొనేందుకు సిద్ధపడుతున్నారు. ఈ కొత్త ట్రెండ్ ద్వారా రైతులకు శ్రమతగ్గనుంది. ఇదిలా ఉండగా ప్రైవేటు వ్యాపారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని అధికారులు చెబుతున్నారు. ముందు అధిక ధర చెల్లిస్తామని నమ్మబలుకుతారని, ధాన్యం ఎత్తుకెళ్లిన తర్వాత ముఖం చాటేస్తారని అంటున్నారు. అదే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయిస్తే నేరుగా రైతుల ఖాతాల్లోనే నగదు బోనస్‌తోపాటు జమ అవుతుందని, రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

## సీలింగ్ భూముల సర్వే పనుల పరిశీలన



ప్రజాపక్షం/ఇల్లెందు: మండల పరిధిలోని మామిడిగుండాల గ్రామ పంచాయితీ పరిధిలో కొనసాగుతున్న సీలింగ్ భూముల సమగ్ర సర్వే పనులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మామిడిగుండాల రెవెన్యూ పరిధిలోని భూముల విస్తీర్ణం, సర్వే వివరాలు, సీలింగ్ భూముల గుర్తింపు ప్రక్రియపై తహసీల్దార్, సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే పనుల పురోగతిని సమీక్షించారు.

## జలసిరి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రతి రైతు జలసిరి పథకం ద్వారా పంట కుంటలు ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని మంగ్రాజుపల్లిలో పంట కుంటలను పరిశీలించి, రైతులు, కూలీలకు పలు సూచనలు చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు పంట కుంటలతో పాటు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, పని కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అమ్మజాన్, ఈసీ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబురాలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు నేలకొండపల్లి మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో సందడి చేశారు. ఐకేపీ కార్యాలయం వద్ద పండుగ వాతావరణం నెలకొనగా, మహిళ కోలాహలంతో ప్రాంగణం కళకళలాడింది. ఈ కార్యక్రమంలో రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు, ఐకేపీ సీసీలు పెద్దపాక వెంకటేశ్వర్లు, పెరుగు మల్లయ్య, బీడీఎస్పీలు మల్లెబోయిన పుష్ప, కట్టెకోల లావణ్య, శ్రీ లక్ష్మీ, పురందేశ్వరి, కె.కరుణ, పద్మ గ్రామదీపికలు గుత్తి కొండ రాణి, బాజా వనజ, చిట్టా సుధారాణి, శ్రీలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## జూలూరుపాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



**తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్ర**

ప్రజాపక్షం/జూలూరుపాడు: ఎల్నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ మండల కార్యవర్గ సమావేశం సిరిపురపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని దిగుబడి చేతికి వచ్చే పరిస్థితి లేదని ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. గోదావరి జలాలతో చెరువులను నింపాలని, రైతులకు కరువు పరిహారం తక్షణమే ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒకటని అనేక మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తెలిపారు. తక్షణం జూలూరుపాడు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి ఒక్కో ఎకరానికి పరిహారంగా రూ.30 వేలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు అడుగంటాయని భూగర్భ జల నీటి మట్టం కనిష్ఠ స్థాయికి చేరుకుంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని కనీసం చేతికి అందిన పంటలనైనా కాపాడేందుకు ప్రయత్నం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో గోదావరి జలాలను అందించే ప్రక్రియను తక్షణం పూర్తి చేయాలని ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైనంత మేరకు గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపాలని ఆయన డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాయని కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ఆలోచన చేయడం లేదని విమర్శించారు. పత్తికి కనీస మద్దతు ధర 13,000 ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, షేక్ నాగుల్ మీరా, ఎల్లంకి మధు, పోనేకంటి వెంకటేశ్వర్లు, గుండె పిన్ని మధు సుధన్ రావు, కంచర్ల రాఘవేంద్రరావు, వల మల్ల సామేలు హలవత్ బద్రు, కొండ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచి ఎస్‌హెచ్‌ఓగా సతీష్ బాధ్యతల స్వీకరణ

**-కల్లూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన జే నాగరాజు**



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్ఓ)గా కె సతీష్ బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని ఐటీ కోర్ టీమ్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరారు. ఇప్పటి వరకు కూసుమంచి ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన కె నాగరాజు ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కల్లూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కూసుమంచి పోలీస్ స్టేషన్ సిబ్బంది నాగరాజును ఘనంగా సన్మానించి, ఆయన సేవలను అభినందించారు. ఈకార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, నూతన ఎస్‌హెచ్ఓ కే సతీష్ పాల్గొన్నారు.

## ఆకస్మికంగా విద్యుత్ సబ్ స్టేషన్ల తనిఖీ

**-అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశం**



ప్రజాపక్షం/కూసుమంచి: టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి శుక్రవారం కూసుమంచి 132కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం 33/11కేవీ కూసుమంచి ఉపకేంద్రంలో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8 ఎంవీఏ సామర్థ్యానికి మారుస్తున్న పనులను పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, విద్యుత్ సరఫరా మెరుగుపడేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఖమ్మం సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ట్రాన్స్‌కో ఎస్ఈ రాంబాబు, ఖమ్మం రూరల్ డీఈ సీహెచ్ నాగేశ్వరరావు, కూసుమంచి ఏడీఈ వెంకట్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాలకు మెరుగైన విద్యుత్ వెలుగులు





**-ముసలిమడుగులో రూ 2.50కోట్లతో 33/11కేవీ సబ్ స్టేషన్**
**-నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎంఎల్ఏ పాయం**

ప్రజాపక్షం/బూర్గంపాడు: మారుమూల గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముసలిమడుగు గ్రామ పంచాయితీలో రూ 2.50కోట్ల వ్యయంతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మించనున్నారు. శుక్రవారం ఈ నిర్మాణ పనులకు పినపాక ఎంఎల్ఏ, ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ పాయం మాట్లాడుతూ కొత్త విద్యుత్ ఉప కేంద్రం అందుబాటులోకి వస్తే పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరా సమస్యలు తగ్గడంతో పాటు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూలపల్లి సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు, మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ మహేందర్, విద్యుత్ శాఖ డీఈ జీవన్‌కుమార్, నిర్మాణ శాఖ డీఈ వెంకటేశ్వరరావు, ఏడీఈ నరసింహారావు, నిర్మాణ శాఖ ఏడీఈ మధు, ఏఈలు ఉపేందర్, వెంకటేశ్వరరావు, ఎంపీఓ రామకృష్ణ, ఎస్ఎలఐ సత్యనారాయణ, ఎల్ఐలు తొటమల్ల సురేష్, రమేష్, భాస్కర్, పంచాయితీ కార్యదర్శి ఎం వెంకట నాగిరెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యాసంగిలో ఆరుతడి పంటలే సాగు చేయాలి

**వ్యవసాయ సహాయ సంచాలకులు రాజేష్**



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున యాసంగిలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని ముజ్జుగూడెం, భైరవునిపల్లి గ్రామాల్లో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. పంటల మార్పిడితో రైతులకు ప్రయోజనం కలుగుతుందని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, ఏఈవోలు శివకృష్ణ, రైతు ప్రతినిధులు వేగినాటి లక్ష్మీ నర్సయ్య, ఉండమోదుగుల శ్రీనివాసరావు, మల్లెబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగాన్ని ఆదుకోవాలి

**ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు**

**ప్రజాపక్షం/చింతకాని :** తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఖమ్మం జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని తక్షణమే ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. శుక్రవారం చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో ఏఐకేఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ ఇప్పటికే రైతులు ఒక్కో ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టారని పంట చేతికొచ్చే పరిస్థితి లేదని ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.తక్షణం కరువు ప్రాంతంగా ప్రటించి సాగర్, గోదావరి జలాలతో చెరువులు, కుంటు నింపాలని ఆయన డిమాండ్ చేశారు. సన్న వడ్లకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం మద్దతు ధరను పెంచాలని , కౌలు రైతులను గుర్తించి తక్షణమే వారిని ఆదుకోవాలని డిమండ్ చేశారు. యూరియా యాప్‌ను రద్దుచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ



సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, ఏనుగు గాంధీ, నాయకులు పదిమల వెంకటనర్సయ్య, చాటల రమేష్, హరికొట్ల భారతమ్మ, ఏపూరి నరసయ్య, అరికొట్ల భాస్కర్, షేక్ హుస్సేన్, కోపెల జ్యోతి, శేషగిరి, పంది శేఖర్, పి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** విద్యుత్ సరఫరా విషయంలో అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని టీజీఎన్‌పిడీసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిదిలోని పెద్దగోపతి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సబ్‌స్టేషన్ పనితీరు, విద్యుత్ సరఫరా స్థితిగతులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఖమ్మం సర్కిల్ పరిదిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందించడమేలక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ప్రస్తుత డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సాంకేతిక సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. విద్యుత్ సరఫరా విషయంలో అప్రమత్తంగా ఉంటు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎస్ఈ శ్రీనివాసాచారి, డిఈ రమేష్, పెద్దగోపతి ఏఈ భరధ్వాజు పాల్గొన్నారు.



# కల్లూరు ఆసుపత్రికి కాయకల్ప అవార్డు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు వైద్య విధాన పరిషత్ ప్రాంతీయ వైద్యశాలకు కాయకల్ప అవార్డు, రూ లక్ష నగదు బహుమతి అధికారులు ప్రకటించినట్లు కల్లూరు ఆసుపత్రి అధికారి, ప్రత్యేక షుగర్, బిపి పాయిజన్ ప్రత్యేక వైద్య నిపుణులు రంజిత్ తెలిపారు. 202425 సంవత్సరానికిగాను ఆసుపత్రిలోనే బెడ్లు, పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్, మందుల నిల్వలు, అగ్ని ప్రమాద జాగ్రత్తలు, సిబ్బంది పర్యవేక్షణ, భోజనం అందించే విధానం, రికార్డులు నిర్వహణ పరిశీలన, సిబ్బంది పనితీరు, ప్రయోగశాల పరీక్షలు, ఆసుపత్రిలో సిబ్బంది పనితీరు, పలు రకాల పనులను సేవలను వైద్య విధాన పరిషత్ రాష్ట్ర సిబ్బంది అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి అవార్డు నగదు బహుమతి లక్ష రూపాయలు ప్రశంసా పత్రాన్ని ప్రకటించారు. అదే విధంగా 2027 జనవరిలో జరిగే కాయకల్ప కార్యక్రమానికి కూడా ప్రత్యేక బహుమతిని అందుకునేందుకు రోజువారి పరిశీలనలు పర్యవేక్షణలు చేస్తున్నట్లు డాక్టర్ రంజిత్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు 250 మంది పలు రకాల వ్యాధులకు సంబంధించిన వ్యాధిగ్రస్తులు సేవలను పొంది విముక్తి పొందుతున్నారు. ఆసుపత్రిలో ప్రత్యేక గైనకాలజిస్ట్ భాగం జనరల్ సర్జన్ ,షుగర్ బిపి, పాయిజన్ పలు రకాల ప్రత్యేకవైద్యులు అందు





బాటులో ఉన్నట్లు ఆసుపత్రి అధికారి తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఉచిత సేవలను వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అధికారి రంజిత్, అశోక్, నిఖిత, పర్యావరణ పరిరక్షణ బాధ్యులు రాధిక సమిష్టి కృషితో అవార్డు అందుకున్నట్లు సూపరిండెంట్, పర్యవేక్షకులు రంజిత్ తెలిపారు. కాయకల్పలో రాష్ట్రస్థాయిలో కల్లూరు ఆసుపత్రి విజేతగా నిలిచిందని వివరించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్, కమిషనర్ జి. సాయి కృష్ణారెడ్డి, సర్పంచులు పలు శాఖల అధికారులు వారిని హర్షిస్తూ అభినందించారు.

# సీపీఐ, ఏఐఎస్ఎఫ్ పోరాటంతో గుండాల ఆసుపత్రికి రెగ్యులర్ డాక్టర్

**-నూతన వైద్యుడికి ఘన సన్మానం**



**ప్రజాపక్షం/గుండాల:** సీపీఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు, నిరసనల ఫలితంగానే గుండాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెగ్యులర్ డాక్టర్‌ను ప్రభుత్వం కేటాయించిందని సీపీఐ మండల కార్యదర్శి వాగబోయిన రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే షాహిద్ తెలిపారు. నూతన వైద్యుడిని నాయకులు ఘనంగా సన్మానించారు. మండల ప్రజలు వైద్య సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఆసుపత్రిలో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడిందని వారు పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి ఆందోళనలు నిర్వహించామని తెలిపారు. రెగ్యులర్ డాక్టర్ నియామకం ప్రజా ఉద్యమాల విజయమని, ఇది ప్రజల ఐక్యతతో సాధించిన ఫలితమని అన్నారు. నూతన వైద్యుడు పేద, గిరిజన ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య సిబ్బంది, మందులు, పరికరాలను సమకూర్చి వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, బచ్చల రామయ్య, సాహెబ్, లక్ష్మయ్య, హరీష్, వరుణ్, నాసిర్, చందు, భద్రం, రమేష్, చిన్నరాములు, తదితరులు పాల్గొన్నారు.

# ‘నాన్నా.. తమ్ముడిని కడసారి చూడవే’..!

**-‘ఇప్పుడు చూడలేనమ్మా.. రేపటి అసలే చూడలేము!’ అంటూ అక్క రోదన**
**-19 సంవత్సరాల యువకుడు మృతి**



**ప్రజాపక్షం/వైరా:** అప్పటివరకు ఇంట్లో నవ్వుతూ తిరిగిన ఆ యువకుడు...కాసేపటికే విగతజీవిగా మారడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. చేతికి అందివచ్చిన కుమారుడు ఇక లేడన్న నిజాన్ని జీర్ణించుకోలేక తండ్రి కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా...తమ్ముడి మృతదేహాన్ని చూసి తట్టుకోలేకపోయిన అక్క రోదన అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. ‘‘నాన్నా..తమ్ముడిని చూడవే!’’ అంటూ అక్క తండ్రిని వేడుకోగా...‘‘నేను చూడలేనమ్మా...అంటూ తండ్రి కన్నీటితో బదులిచ్చాడు. ‘‘ఇప్పుడు చూడలేనంటున్నావు నాన్నా...రేపటి నుంచి అసలే చూడలేము కదా...తమ్ముడిని కడసారి చూడవే!’’ అంటూ అక్క విలపించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది. తండ్రి రోదన, అక్క ఆవేదనతో ఆ ప్రాంతమంతా విషాదంలో మునిగిపోయింది. అక్కడికి చేరుకున్న గ్రామస్థులు సైతం కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ కిన్నెర కృష్ణ కుమారుడు కిన్నెర రాఘవ్(19) హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల నేపద్యంలో బుధవారం ఇంటికి వచ్చిన రాఘవ్...శుక్రవారం ఉదయం సుమారు 7.30 గంటల సమయంలో ఒక్కసారిగా హాల్‌లోకి వచ్చి సోఫాలో కూర్చుకున్నాడు. కొద్దిసేపటికే సోఫాలోనే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆందోళనతో స్థానిక వైద్యులను సంప్రదించగా, అప్పటికే మృతి చెందినట్లు వారు నిర్ధారించినట్లు సమాచారం. రాఘవ్ ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో చనిపోయారు. చిన్న వయసులోనే కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రుల వేదన వర్ణాతీతంగా మారింది. అక్క రోదన, తండ్రి ఆవేదన చూసిన వారందరి హృదయాలు చలించిపోయాయి. చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకుంటాడని ఆశించిన యువకుడు ఇలా అకస్మాత్తుగా దూరం కావడంతో వైరా ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆ కుటుంబానికి తీరని లోటును మిగిల్చిన ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. రాఘవ్ మరణ వార్త తెలుసుకున్న స్థానికులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు రాఘవ్ పార్థీవదేహానికి నివాళులు అర్పించారు.

# కుష్టువ్యాధి గుర్తింపునకు ప్రత్యేక ప్రచారం



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** జిల్లాలో కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా ఆక్టోబర్ 22 నుంచి నవంబర్ 4 వరకు లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు డిఎంహెచ్ఓ డాక్టర్ డి రామారావు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి నిర్వహించిన శిక్షణను ఆయన ప్రారంభించారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, కుష్టు వ్యాధికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చికిత్స అందుబాటులో ఉందని పేర్కొన్నారు. వ్యాధిని తొలిదశలో గుర్తించి చికిత్స తీసుకుంటే అనుమానితులను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణు మాధవరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి బోరు మోటార్‌కు మరమ్మతులు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో తాగునీటి బోరు మోటార్‌కు మరమ్మతులు నిర్వహించారు. శుక్రవారం సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా ఆధ్వర్యంలో గ్రామంలో ప్రధాన తాగునీటి వనరుగా ఉన్న బోరు మోటార్‌కు మరమ్మతులు నిర్వహించారు. బోరు మోటార్ చెడి పోయిన విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకు రావడంతో తక్షణమే స్పందించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మరమ్మతులు నిర్వహించారు. ఈ బోరు ద్వారానే గ్రామంలోని ప్రజలంతా తాగునీటి కోసం, ఈ గ్రామం మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు కూడా ఈ నీటినే ఉపయోగిస్తున్నారు. సమస్యను గుర్తించి తాగునీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు వెంటనే స్పందించి బోరు మోటార్‌ను రిపేర్ చేయించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశ్వని, పంచాయతీ సిబ్బంది శ్రీను, సందీప్, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలి

**-విద్యుత్ సబ్ స్టేషన్లను పరిశీలించిన సిఎండి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలని టిజిఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా పరిధిలోని పలు విద్యుత్ సబ్ స్టేషన్లను సిఎండి వరుణ్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖమ్మం సర్కిల్ పరిధిలోని 132/33 కెవి ఆరెంపుల, కూసుమంచి, అన్నారుగూడెం, 33/11కెవి ఏన్కూరు సబ్ స్టేషన్లను సందర్శించి విద్యుత్ సరఫరా పరిస్థితిని సిఎండి పరిశీలించారు. సబ్ స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, నిర్వహణ చర్యలు, విద్యుత్ సరఫరా స్థితి గతులను పరిశీలించారు. ఈ సందర్బంగా సిఎండి మాట్లాడుతూ వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేలా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయిన వెంటనే త్వరితగతిన మార్చాలని రైతులకు అదనపు మోటార్ల వినియోగం వల్ల కలిగే సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకునేలా వినియోగదారులకు సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శ్రీనివాసాచారి, డిఈ ఖమ్మం రూరల్ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా వేపకాయల బతుకమ్మ



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో బి పద్మ ఆధ్వర్యంలో వేపకాయల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామ పంచాయితీలకు చెందిన మహిళా కార్యదర్శులు బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు.

# అణచివేత తిరుగుబాటు.. అన్యాయంపై పోరాటం..!



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అణచివేతపై తిరుగుబాటు, అన్యాయంపై పోరాటం, భూమి, భుక్తి, విముక్తి కోసం జీవితాంతం సమరం..! తెలంగాణ గడ్డపై నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన చారిత్రక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొని, పేదలు, రైతులు, కష్టజీవుల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన విప్లవ యోధుడు కామ్రేడ్ కర్నాటి కృష్ణయ్య. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా, ఎర్రజెండానే ఆశయంగా, దోపిడీ పీడన లేని సమసమాజ స్థాపనే లక్ష్యంగా పనిచేసిన ఆయన నేలకొండపల్లి ప్రాంత ప్రజా ఉద్యమాల చరిత్రలో చెరగని ముద్ర వేశారు. నిర్బంధాలు, జైలు జీవితాలు ఎదురైనా నమ్మిన సిద్ధాంతాన్ని వీడని ఆయన ప్రస్థానం ఒకవైపు ఉంటే, మరోవైపు కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకొని, భర్త పోరాటానికి అండగా నిలిచిన కామ్రేడ్ సామ్రాజ్యం త్యాగాలు మరో చారిత్రక అధ్యాయంగా నిలుస్తాయి. పోరాటమే ఊపిరిగా బతికిన కర్నాటి కృష్ణయ్య 28వ వర్ధంతి సందర్భంగా ఆయన జీవిత ప్రస్థానంతోపాటు, ఆయనకు తోడుగా నిలిచిన సామ్రాజ్యం సేవలను స్మరించుకోవడం అవసరం.

### 1923లో జననం.. ప్రజా ఉద్యమాల వైపు అడుగులు

1923 ఆగస్టు 24న జన్మించిన కర్నాటి కృష్ణయ్య చిన్ననాటి నుంచే సమాజంలోని అసమానతలు, పేద ప్రజల కష్టాలు, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న దోపిడీ వ్యవస్థల మధ్య తన జీవితాన్ని కొనసాగించారు. భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థలో రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పేదలపై సాగిన అణచివేతలు ఆయనను ప్రజా ఉద్యమాల వైపు నడిపించాయి. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమాజ మార్పుకే ప్రాధాన్యమివ్వాలనే ఆలోచనతో కమ్యూనిస్టు ఉద్యమంలో అడుగుపెట్టారు. 194 కమ్యూనిస్టు పార్టీలో ఆయన అప్పటి నుంచి ఎర్రజెండా ఆశయాలతో ప్రజల మధ్య పనిచేశారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం, వారిని సంఘటితం చేయడం, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే చైతన్యాన్ని కల్పించడం తన బాధ్యతగా భావించారు. రాజకీయాలు పదవుల కోసం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఉపయోగపడాలని నమ్మిన ఆయన, తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేశారు.

### దొరల దౌర్జన్యాలపై ధిక్కార స్వరం..

నిజాం పాలనలో తెలంగాణ పల్లెలు భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థ కింద నలిగిపోయాయి. భూమిపై హక్కులు లేకపోవడం, అధిక శిస్తులు, వెట్టిచాకిరీ, దొరల దౌర్జన్యాలతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తరతరాలుగా అణచివేతకు గురైన ప్రజల్లో తిరుగుబాటు జ్వాలలు రగిలాయి. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రజల్లో హక్కుల చైతన్యాన్ని నింపింది. ఈ చారిత్రక పోరాట కాలంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు అండగా నిలిచి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను సమీకరించింది. అలాంటి పోరాట స్ఫూర్తితో ముందుకు సాగిన నాయకుల్లో కర్నాటి కృష్ణయ్య ఒకరు. ఆనాటి ఉద్యమ అగ్రనేతలైన పుచ్చలపల్లి సుందరయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు తదితరులకు రహస్యంగా ఆశ్రయం కల్పించారు. పార్టీ పిలుపు మేరకు మునగాల పరగణాలో దళాన్ని ఏర్పాటు చేసి ప్రజా ఉద్యమాలు, పోరాటాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగస్వాములయ్యారు. ప్రజలను చైతన్యపరచడం, అణచివేతకు వ్యతిరేకంగా నిలబడే ధైర్యాన్ని నింపడం, పేదలకు అండగా నిలవడం ద్వారా ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం సాగిన పోరాట అనుభవాలు ఆయన రాజకీయ జీవితానికి బలమైన పునాదిగా నిలిచాయి.

### నిర్బంధాలు.. జైలు జీవితాలు.. అయినా వీడని పోరాటం

ప్రజల హక్కుల కోసం పోరాడే క్రమంలో కర్నాటి కృష్ణయ్య ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొన్నారు. ఖమ్మం పట్టణంలో జరిగిన బండి పట్టాల పోరాటంలో పాల్గొన్న ఆయన పోలీసుల అరెస్టుకు గురయ్యారు. బందరు సబ్‌జైలు, రాజమండ్రి జైలు, కడలూరు జైలు, వరంగల్ సెంట్రల్ జైలు, చంచల్‌గూడ జైలు తదితర ప్రాంతాల్లో సుమారు నాలుగేళ్ల పాటు జైలు జీవితం గడిపారు. కుటుంబానికి దూరంగా ఉండటం, నిర్బంధాలను ఎదుర్కోవడం, వ్యక్తిగత జీవితంలో ఎన్నో కష్టాలను అనుభవించడం ఆయనకు తప్పలేదు. అయినప్పటికీ ప్రజల విముక్తి కోసం ఎంచుకున్న పోరాట మార్గాన్ని వీడలేదు. నమ్మిన సిద్ధాంతం పట్ల నిబద్ధతతో, ప్రజల హక్కుల సాధనే లక్ష్యంగా ముందుకు సాగారు. జైలు గోడలు ఆయన అడుగులను కొంతకాలం ఆపగలిగినా, ప్రజల కోసం పోరాడాలనే సంకల్పాన్ని మాత్రం ఆపలేకపోయాయి.

### ఖమ్మం తొలి ఎమ్మెల్యేగా చారిత్రక గుర్తింపు..

ప్రజా ఉద్యమాల్లో సంపాదించుకున్న అనుభవం, సామాన్య ప్రజలతో ఏర్పడిన అనుబంధం కర్నాటి కృష్ణయ్యను రాజకీయ రంగంలోనూ ముందుకు నడిపించాయి. 1952 సాధారణ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఖమ్మం తొలి ఎమ్మెల్యేగా గుర్తింపు పొందిన ఆయన ప్రస్థానం ప్రజా ఉద్యమాల నుంచి శాసన సభ వరకు సాగిన అరుదైన ప్రయాణం. ప్రజా పోరాటాల నుంచి వచ్చిన నాయకుడిగా రైతుల సమస్యలు, పేద ప్రజల ఇబ్బందులు, గ్రామీణ ప్రాంతాల అవసరాలపై ఆయనకు ప్రత్యక్ష అవగాహన ఉండేది. శాసనసభ వేదికను ప్రజల సమస్యలను ప్రస్తావించడానికి, పేదల హక్కుల కోసం గళమెత్తడానికి ఉపయోగించుకోవాలనే దృక్పథంతో పనిచేశారు. 1955లో నాగార్జునసాగర్ నిర్మాణానికి సంబంధించిన ఉద్యమంలోనూ ఆయన పాల్గొన్నట్లు అందుబాటులో ఉన్న జీవిత వివరాలు పేర్కొంటున్నాయి. రైతాంగ ప్రయోజనాలు, సాగునీటి అవసరాలపై సాగిన ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. ప్రజల మధ్య నుంచి ఎదిగి, వారి సమస్యలను రాజకీయ వేదికలపైకి తీసుకెళ్లిన నాయకుడిగా తనదైన ముద్ర వేశారు. పదవి అనేది ప్రజలపై అధికారం చెలాయించడానికి కాదని, వారి కష్టాలను అర్థం చేసుకొని పరిష్కారానికి కృషి చేయడానికి లభించిన బాధ్యత అని ఆయన జీవితం చాటిచెబుతుంది. అందుకే కర్నాటి కృష్ణయ్య పేరు ఖమ్మం రాజకీయ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయింది.

**తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడిగా**
**ఖమ్మం తొలి ఎమ్మెల్యేగా.. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా ప్రజా జీవితానికి అంకితం**
**దొరల దోపిడీపై ధిక్కార స్వరం.. పేదల విముక్తి కోసం జీవితాంతం సమరం**
**భర్త పోరాటానికి అండగా నిలిచిన కామ్రేడ్ సామ్రాజ్యం.. త్యాగాల బాటలో సాగిన ఆదర్శ జీవితం**
**నేడు 28వ వర్ధంతి**

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి విశేష కృషి

### 28వ వర్ధంతి.. విప్లవ జోహార్లు

1923 ఆగస్టు 24న జన్మించిన కర్నాటి కృష్ణయ్య 1998 అక్టోబర్ 17న నేలకొండపల్లిలో తుదిశ్వాస విడిచారు. ఆయన 28వ వర్ధంతి సందర్భంగా అక్టోబర్ 17న ఆ పోరాట యోధుడి సేవలను స్మరించుకోవడం, ఆయన నమ్మిన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అవసరం.

### దొరల దోపిడీపై ధిక్కార స్వరం వినిపించిన యోధుడు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భాగస్వామి, ఖమ్మం తొలి ఎమ్మెల్యే, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి అంకితమైన నాయకుడు కర్నాటి కృష్ణయ్య ఆయనకు జీవిత సహచరిగా అండగా నిలిచి కుటుంబ బాధ్యతలను మోసిన కామ్రేడ్ సామ్రాజ్యం త్యాగాలు కూడా ఈ పోరాట ప్రస్థానంలో భాగమే. పేదలు, రైతులు, కష్టజీవుల హక్కుల పరిరక్షణకు కృషి చేయడం, సామాజిక సమానత్వం కోసం పోరాడడం, ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడం ద్వారా ఆ దంపతుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి అర్పించే నిజమైన నివాళి.

అణచివేతపై తిరుగుబాటు చేసిన పోరాట యోధుడికి విప్లవ జోహార్లు!

**కామ్రేడ్ కర్నాటి కృష్ణయ్యకు ఎర్రజెండా నివాళి!**

---

# మణుగూరు ఏరియాలో డైరెక్టర్ పర్యటన

**-బెల్ట్ కన్వేయర్ ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్ష**
**నాణ్యత, భద్రతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశాలు**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఏరియాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ఆధునిక బొగ్గు రవాణా వ్యవస్థల పనితీరును పరిశీలించేందుకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమల రావు శుక్రవారం అధికారికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, జీఎం (సివిల్) ఆర్. సతీశ్ బాబు, జీఎం (సీహెచ్పీ) కే. శ్రీనివాసులు లతో కలిసి జీఎం కార్యాలయం, పీకేఓసీ2 గని, కేఏసీహెచ్పీ ప్రాంతాలను సందర్శించారు. అనంతరం జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మణుగూరు ఏరియాలోని గనుల కార్యకలాపాలు, బొగ్గు ఉత్పత్తి, అభివృద్ధి పనులు, యంత్రాల నిర్వహణ, భద్రతా చర్యలపై సంబంధిత అధికారులు డైరెక్టర్ కి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని, యంత్రాలను సమర్ధవంతంగా వినియోగించాలని, కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పర్యటనలో భాగంగా పీకేఓసీ నుంచి కేఏసీహెచ్పీ వరకు నిర్మాణంలో ఉన్న బెల్ట్ కన్వేయర్ ప్రాజెక్టు పనులను డైరెక్టర్ (ఈఅండ్ఎం) ఎం. తిరుమల రావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏషియన్ ఇండ్వెల్ జాయింట్ వెంచర్ సంస్థ చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా పీకేఓసీ గనిలో తవ్విన బొగ్గును కేఏసీహెచ్పీ వరకు వేగంగా, సురక్షితంగా, సమర్థ వంతంగా రవాణా చేయవచ్చని అధికారులు వివరించారు. సంప్రదాయ బొగ్గు రవాణా పద్ధతులతో పోలిస్తే ఈ వ్యవస్థ ద్వారా రవాణా సమయం, ఖర్చు తగ్గడంతో పాటు ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. పరికరాల తయారీలో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ప్రాజెక్టు పనుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు ఆయనకు వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ వి. మధన్ నాయక్, ప్రాజెక్ట్ అధికారి పికేఓసి బి. శ్రీనివాస చారి, ప్రాజెక్ట్ ఇంజినీర్ పికేఓసి పి రామకృష్ణ, డిజిఎం (ఈ అండ్ఎం), కెసిహెచ్పి ఆర్.ఎస్. గౌడే, డిజిఎం (ఈ అండ్ ఎం), ఏడబ్ల్యాఎస్ టి. శ్రీకాంత్, డిజిఎం (సివిల్)జి. శివ ప్రసాద్, ఏరియా సెక్యూరిటీ అధికారికే. శ్రీనివాస్, సర్వేయర్ నర్సింహారావు, ఇతర ఉన్నత అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## కొమురం భీమ్ విగ్రహావిష్కరణ ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 22న నిర్వహించనున్న కొమురం భీమ్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లను ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావు, మాజీ ఎంఎల్‌ఏ తాటి వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. దుమ్ముగూడెం మండలంలోని విగ్రహావిష్కరణ స్థలాన్ని సందర్శించి, ఏర్పాట్లపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా బస్ షెల్టర్ వద్ద, అంబేద్కర్ విగ్రహం పరిసరాల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమ ఏర్పాట్లపై నిర్వాహకులను అభినందించారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక గౌరవ అధ్యక్షుడు కొమురం దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఎస్ఐగా పడాల కేశవ్



**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణ నూతన ట్రాఫిక్ ఎస్ఐగా పడాల కేశవ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన చర్ల ఎస్ఐగా విధులు నిర్వహించారు. పట్టణ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు.

## భద్రాద్రి వాసికి అమెరికాలో కాంస్య పతకం




**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన జిమ్ క్రీడాకారుడు డివి శంకర్‌రావుకు అమెరికాలో జరిగిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కాంస్య పతకం దక్కింది. 74 వయస్సు గల సీనియర్ అథ్లెటిక్ శంకర్ రావు గుండెకు జరిగిన బైపాస్ సర్జరీని సైతం లెక్కపెట్టకుండా సంకల్పబలంతో జాతీయ స్థాయిలో సత్తా చాటి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో మెరిశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందిస్తున్నారు. 74 ఏళ్ల ప్రాయంలో వయస్సు కేవలం ఒక సంఖ్యమాత్రమే అని ఆయన చాటి చెబుతున్నారని కొనియాడారు.

## ఆకస్మికంగా రైస్ మిల్లుల తనిఖీ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** మండలంలోని రైస్ మిల్లుల్లో నిల్వల వివరాలపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా శుక్రవారం డీఎస్ఓ చంద్రకుమార్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లుల్లో ఉన్న బియ్యం, ధాన్యం నిల్వలను రికార్డులతో సరిపోల్చి పరిశీలించారు. రికార్డుల్లో పేర్కొన్న నిల్వలకు, క్షేత్రస్థాయిలో ఉన్న నిల్వలకు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయా లేదా అనే అంశాన్ని స్వయంగా తనిఖీ చేశారు. ఇటీవల కొన్ని రైస్ మిల్లులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వాటికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిల్లుల్లో నిల్వల పరిస్థితి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై పరిశీలన చేపట్టారు. ఈ తనిఖీలకు సంబంధించి సాంకేతిక అధికారుల నివేదిక అందిన అనంతరం, అందులోని అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీఎస్ఓ చంద్రకుమార్ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లైస్ అధికారి విజయబాబు పాల్గొన్నారు.

# ఖమ్మం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి



**-తలసరి ఆదాయం రూ.10లక్షలకు పెంచే లక్ష్యంతో కార్యాచరణ : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 2033 నాటికి విశాలమైన ఆర్థిక వ్యవస్థ, మెరుగైన ఆదాయం, పేదరిక నిర్మూలన, సుసంపన్నమైన భవిష్యత్తు దిశగా ఖమ్మం అభివృద్ధి తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీజ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్‌కుమార్ తో కలిసి జిల్లా అభివృద్ధి రూపకల్పనపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 2047 డాక్యుమెంట్‌కు అనుగుణంగా ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భాగంగా ప్రతి జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా పదవి విరమణ పొందిన ఒక ఉన్నతాధికారిని ప్రభుత్వం నియమించిందని సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తయారీకి పైలెట్ జిల్లాగా ఖమ్మంను ఎంపిక చేసిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 14.3 లక్షల జనాభా, ఐదులక్షల కుటుంబాలు ఉన్నాయని జిల్లాలో యేటా సుమారు రూ. 52వేల కోట్ల ఆర్థిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. తలసరి ఆదాయం సుమారు రూ.3.3 లక్షలుగా ఉందని దీనిని 2028 నాటికి ఐదు లక్షలకు, 2033 నాటికి రూ.10లక్షలకు పెంచే లక్ష్యంతో శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ ఉత్పాదకత పెంపుతో పాటు ఆహార శుద్ధి కేంద్రాలు, మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపర్చాలని చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.సెర్ప్ ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల్లో సగం మందిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. జిల్లాను లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు రవాణా, పర్యాటకం, సౌర విద్యుత్ రంగాలను విస్తరించాలని, తయారీ రంగంలో వృద్ధిని పరుగులు పెట్టించాలని ఆదేశించారు. వివిధ రంగాల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన కోసం ఎనిమిది నుంచి 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, ప్రతి బృందం తమ క్షేత్రస్థాయి గణాంకాలు, బలాలు, అవకాశాలను విశ్లేషిస్తూ వచ్చే గురువారం కలెక్టరేట్‌లో సమగ్ర ప్రజంటేషన్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు సామర్థ్యాభివృద్ధి శిక్షణ

**ప్రజాపక్షం/వైరా:** జామ, అరటి పంటల్లో కోత అనంతరం సంభవించే నష్టాలను తగ్గించి, నాణ్యతను కాపాడుకోవడంతో పాటు మెరుగైన మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకునేలా రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం(కెవికె) వైరా ఆధ్వర్యంలో రెండు రోజుల సామర్థ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ నైపుణ్య మండలి(ఏఎస్‌సిఐ) ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ శిక్షణలో 25 మంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నిలిమ మాట్లాడుతూ జామ, అరటి పంటల్లో కోత అనంతరం వివిధ కారణా వలన ఉత్పత్తుల నాణ్యత దెబ్బతినడం, పండ్లు పాడవడం, మార్కెట్ విలువ తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ నష్టాలను నివారించేందుకు పంట కోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పండ్లను సురక్షితంగా నిర్వహించే పద్ధతులు, నష్టాలను తగ్గించే యాజమన్య చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా రైతులు ప్రగతిశీల రైతు గోపాలరావు జామ తోటను సందర్శించారు. అక్కడ జామ, అరటి పంటల్లో కోత అనంతరం సంభవించే నష్టాలను గుర్తించడం, వాటి నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై క్షేత్రస్థాయిలో ప్రాయోగిక శిక్షణ అందించారు. తద్వారా రైతులు తమ



తోటల్లోనే ఈ పద్ధతులను అమలు చేసుకునేలా మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం, వైరా సీనియర్ శాస్త్రవేత్త, ఇంచార్జి అధిపతి డాక్టర్ టి.పావని శిక్షణలో పాల్గొన్న రైతులకు ధృవపత్రాలను పంపిణీ చేశారు. పంట కోత అనంతరం నష్టాలను తగ్గించడం ద్వారా రైతులు పండించిన ఉత్పత్తుల నాణ్యతను కాపాడుకోవడంతో పాటు, మార్కెట్‌లో మెరుగైన ధరలు పొందేందుకు అవసరమైన అవగాహన, నైపుణ్యాలను పెంపొందించడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# యోగా గురూజి నాళ్ల శ్రీనివాసరావుకు ఘన సన్మానం



**గురూజి చిత్రపటాన్ని స్వయంగా చిత్రించిన శిష్యురాలు రాధారాణి**

**ప్రజాపక్షం/మధిర:** దసరా నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం మూలానక్షత్రం చాలా మంగళకరమైన రోజు కాబట్టి చదువుల తల్లి సరస్వతి దేవిని పూజించుకోవాలి అంటే మనం కూడా మన గురువులను పూజించాలి అనే ధ్యేయంతో గత 25 సంవత్సరాల నుంచి ఉచితంగా యోగా నేర్పుతూ ఎంతోమంది అనారోగ్యంగా ఉన్న వ్యక్తులను ఆరోగ్యంగా బలపరిచిన యోగా గురూజి నాళ్ల శ్రీనివాసరావుని యోగా నిత్య సాధన కమిటీ వారి ఆధ్వర్యంలో వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఘనంగా యోగా సభ్యులు అందరూ కలిసి గురూజిని సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండప అధ్యక్షుడు కురువెళ్ల పురుషోత్తమరావు, మధిర మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చారుగుండ్ల నరసింహామూర్తి పాల్గొని యోగ గురూజి నాళ్ల శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు శ్యామలరావు, లింగంపల్లి అప్పారావు, కిషోర్, పుల్లారావు, ఆర్‌టిసి రాజు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, దుర్గాప్రసాద్, కెపి, పసుపులేటి నాగేంద్ర, శ్రీనివాసరావు, నంద, కిషోర్, టీచర్ మల్లరాజు, విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు, లగడపాటి తిరుపతి రావు, నరసింహారావు, హైందవి, లక్ష్మి, రాధా రాణి, జ్యోతి, శిరీష, లలిత, అనూష, సునీత, భారతి, శ్రీదేవి తదితరులు యోగ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం లగడపాటి తిరుపతిరావు యోగా సభ్యులందరికి అల్పాహారం అందించారు.

# గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగు రంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు. మహిళల సందడి, బతుకమ్మ పాటలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మ గౌరవానికి, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి మహిళలంతా ఒకచోట చేరి ఆనందంగా పండుగను జరుపుకుంటారన్నారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యత , సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతిని ప్రేమించి, పర్యావరణాన్ని పరిరక్షించాలనే గొప్ప సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ విజయలక్ష్మి , తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎంపిడిఓ అంబటి శ్రీధర్ రాజు, ఎంపిఓ శ్రీహరికృష్ణ, ఎంపిడిఓ, ఆఫీస్ సూపరింటెండెంట్ వాణి, ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మ రెడ్డి, వార్డు మెంబర్ నాగమణి, సీతారాములు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ బ్రోచర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల కేంద్రంలోని ఆలయ ప్రాంగణంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రిజిస్ట్రేషన్ నెం.72/2025 ఆధ్వర్యంలో డిసెంబర్ 10న జరగనున్న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ అవార్డుల ప్రధానోత్సవ బ్రోచర్‌ను శుక్రవారం మండల అధికారుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా॥ చిన్న యేసు మాట్లాడుతూ డిసెంబర్ 10న తల్లాడలో డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నందు ఉదయం 10 గంటలకు నాలుగు రాష్ట్రాల్లో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న వారిని శాలువతో సన్మానించి అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంకు తల్లాడ ఎంఆర్‌ఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపిడిఓ శ్రీధర్‌రాజు, ఈవో హరికృష్ణ, ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ కుమారస్వామి, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కళ్యాణి, పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్స్, అయ్యప్ప స్వాములు, చిన్నయేసు, కృష్ణవేణి, స్వరూప, భార్గవి పాల్గొన్నారు.

# మండల అధికారులకు వాలీబాల్ క్రీడాకారుల వినతి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న స్థలంలో గత 40 ఏళ్లుగా క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసుకుని వాలీబాల్ ఆడుతున్నామని ఈ మైదానం ద్వారా ఎంతో మంది క్రీడాకారులు నైపుణ్యం సంపాదించి ఉద్యోగాలు సాధించినందున వాలీబాల్ క్రీడ మైదానాన్ని ప్రస్తుతం ఉన్న స్థలంలోనే కొనసాగించాలని క్రీడాకారులు శుక్రవారం ఎంపిడిఓ, తహసీల్దార్, ఈవోలకు వినతి పత్రం సమర్పించారు. ఇటీవల ఈ క్రీడా స్థలం పక్కన ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు జరుగుతున్నాయన్నారు. ఆట నియమాల ప్రకారం వాలీబాల్ క్రీడా ప్రాంగణానికి చుట్టూ సర్వీస్ జోన్ కనీసం 20 అడుగులు ఉండాలని కానీ ప్రస్తుతం ఇక్కడ కేవలం 13 అడుగులు మాత్రమే ఉంది. గ్రామ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లాడ వాలీబాల్ క్రీడా ప్రాంగణంగా గుర్తిస్తూ గ్రామ పంచాయతీలో అధికారిక తీర్మానం ఆమోదించి స్థలాన్ని పూర్తిగా క్రీడలకే కేటాయించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్, కృష్ణ, సైదులు, మెహరాజ్, నాయకులు పాల్గొన్నారు.

# పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/మధిర:** మంగళవారం నల్గొండలో పిఆర్‌టియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని పిఆర్‌టియు నాయకులు తెలియజేశారు. మధిర మండలం ఎంపిపిఎస్ నిదానపురంలో పనిచేస్తున్న సంఘ సీనియర్ సభ్యులు తూమాటి కృష్ణారెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎంపికకావడం పట్ల మధిర మండలశాఖ పక్షాన హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. మధిర మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలే సుధాకర్ ఈ కార్యక్రమంలో పేర్కొన్నారు. గత 25 సంవత్సరాలకు పైగా మధిర ప్రాంతంలో సంఘ అభివృద్ధికి కృష్ణారెడ్డి కృషి చేశారని వారిని రాష్ట్రబాధ్యులుగా ఎంపిక చేసినందుకు పిఆర్‌టియు ఖమ్మం జిల్లా శాఖకు మధిర మండల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కొలగాని ప్రసాదరావు, బూసా కోటేశ్వరరావు, రవికుమార్, పిల్లి నర్సింహారావు, సంగారావు, మధిర మండల బాధ్యులు తదితరులు ఉన్నారు.

# కోతలు లేని కరెంటును అందించాలి

**జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు**



**ప్రజాపక్షం/మధిర:** కెసిఆర్ పాలనలో రాష్ట్రంలో ఎటువంటి కోతలు లేకుండా విద్యుత్ అందించారని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు విలేకరుల సమావేశంలో తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో 7778 మెగా విద్యుత్ ఉత్పత్తిని 19464 మెగా వాట్లకు ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ పెంచారన్నారు. కెసిఆర్ దిగిపోయే నాటికి మిగులు విద్యుత్‌తో అప్పగించడం జరిగిందన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో ఎటువంటి కోతలు లేకుండా 24గంటలు విద్యుత్ అందించారన్నారు. విద్యుత్ అందించడం చేతకాని కమీషన్ల శాఖ మంత్రిగా రాష్ట్రంలో ఖ్యాతి గడించిన విద్యుత్‌శాఖ మంత్రిని మంత్రివర్గం నుండి డిస్మిస్ చేయాలని కమల్‌రాజు అన్నారు. పరిపాలన చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బంది పెడుతుందని, కరోనా కష్టకాలంలో కూడా కెసిఆర్ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉన్నదన్నారు ఎల్‌నినో వస్తే దానికి ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకోకుండా పంటలు వేయొద్దు, కరెంటు పోదువు వాడండి అని కాంగ్రెస్ ప్రభుత్వం కాకమ్మ కబుర్లు చెబుతుందన్నారు. ఎండిపోయిన పంట పొలాలకు నష్టపరిహారం ఇవ్వాలని, కరెంటు కోతలు లేకుండా చూడాలని టిఆర్‌ఎస్ నాయకులు కమల్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలు చేపట్టాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయం, సామాన్య ప్రజల జీవనోపాధికి నష్టం కలగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఖమ్మం జిల్లా నాయకులు శివ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ వర్షపాతం తగ్గడం లేదా అసమానంగా కురవడం వల్ల పంట దిగుబడులు తగ్గి రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు వాతావరణ సమాచారం, శాస్త్రీయ సాగు సలహాలు అందించాలని, పంట నష్టపోయిన రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం, బీమా ప్రయోజనాలు కల్పించాలన్నారు. రైతుల సంక్షేమం, ప్రజల జీవనోపాధి, నిత్యావసర ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణ కార్యాచరణ చేపట్టాలన్నారు.